
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# మూడు గంటల కరెంట్‌తో ఎవుసానికి ముప్పే

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు




- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపాటు
- ధరణితో భూ దందాలకు చెక్
- నేడు సాఫీగా భూముల రిజిస్ట్రేషన్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న జనం

**కాంగ్రెస్‌పై కర్షకులు** కన్నెర్ర చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నారు. వ్యవసాయ రంగానికి మూడు గంటల విద్యుత్ చాలని, 10 హెచ్‌పీ మోటర్ల ద్వారా మూడు గంటల్లో మూడు ఎకరాలు పారుతుందని మాట్లాడటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా చేయడంతో కర్షకులు సంతోషంగా రెండు పంటలు సాగు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు పనిగట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలతో పాటు రైతుల ఆత్మహత్యలు తప్పవని జిల్లా రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో భూ దందాలకు చెక్ పడింది. స్లాట్ బుక్ చేసుకున్న మరుసటిరోజే తహసీల్ కార్యాలయానికి చేరుకుని సాఫీగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇంటికే పాస్‌బుక్ వచ్చేలా ధరణిపోర్టల్‌ను రూపొందించారు. దీంతో నేడు ఎక్కడ కూడా భూసమస్యలు, తగాదాలు కనిపించడం లేదు. సమస్యలు పరిష్కారం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. కాంగ్రెస్ నేతలు సృష్టిస్తున్న గందరగోళంపై కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

*- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 21*

## రాత్రి కరెంట్‌తో సచ్చుడే



సిద్దిపేటరూరల్, నవంబర్ 21: కాంగ్రెసోళ్లు చెబుతుర్రు.. 3,4 గంటలు ఎవుసానికి సరిపోతదని. వాళ్ల మొఖాలకు ఎన్నడైనా ఎవుసం చేసినోళ్లు ఉన్నరా ఆ పార్టీల. ఖద్దరు బట్టలు వేసుకొని ఊర్లళ్ల తిరిగే టోళ్లు.. ఊరి మీద పడి దోచుకున్నరు. కాంగ్రెస్ అంటే పైరవీలే ఎక్కువ. ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే కాంగ్రెస్ నాయకులు పైరవీలు చేయాల్సిందే. వాళ్ల ఇంటికి ఎప్పుడూ తీరగాలె. ఎక్కడికి పోకుండా కేసీఆర్ దయవల్ల 24 గంటల కరెంట్ వల్ల పొలాలకు నీళ్లు పారుతున్నాయి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెసోళ్లు ఉండి ఏమైనా పని చేసిర్రా. అధికారంలో ఉంటే ఢిల్లీకి తిరుగుడే సరిపోతది. కుర్చీల కోసం కొట్లాడటం కాంగ్రెసోళ్ల పని. మొదలు రేవంత్‌రెడ్డి ఏ పార్టీల ఉండే..ఎవుసం వద్దన్న చంద్రబాబు పార్టీల ఉండే..ఇప్పుడు గవే మాటలు మాట్లాడుతుండు. రైతులకు ఎంత కరెంట్ ఇస్తే ఏమైతది. కాంగ్రెస్ అధికారంలో ఉంటే రైతులు సచ్చుడే.. కరెంట్ ఎప్పుడత్తదో తెల్వదు. ఇప్పుడు కాంగెస్‌లో ఉన్నోళ్లంతా ఒకప్పటి పైరవీకారులే.. రైతులను కాల్చి చంపిన పార్టీల ఉన్నోళ్లు. రాత్రిపూట కరెంట్ ఇస్తే పాము కరిచి సచ్చిపోతే మా కుటుంబాలను ఎవరూ చూడాలె.. ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తుంది. గి ప్రభుత్వమే మళ్లీ రావాలె.. రేవంత్‌రెడ్డికి ఎవుసం ఎరుకెనా.. కేసీఆర్ ఉంటేనే కాలం అయితది. పంటలు మస్తుగా పండుతాయి. రైతులను ఆదుకునుడు అంటే కేసీఆర్ వల్లనే అయితది. సచ్చిపోతే రూ.5 లక్షలు ఇస్తుండు. ఇంకా ఏం కావాలె.

*- కుంతారెడ్డి, రైతు, పుల్లూరు, సిద్దిపేట రూరల్*



## కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే

తొగుట, నవంబర్ 21: నేను చిన్నప్పటి నుంచి కాంగ్రెస్, టీడీపీ పాలన చూశా. కరెంట్ కష్టాల పాలయ్యాము. పొద్దున మూడు గంటలు, రాత్రి మూడు గంటల కరెంట్, ఆ కరెంట్ కూడా సక్కగా వచ్చేది కాదు. డిమ్ము కరెంట్ మూలంగా స్టార్టర్లు, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. కరెంట్ కోసం సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వచ్చేది. రెండు ఎకరాలు పంట వేస్తే అద్దెకరం కూడా చేతికి వచ్చేది కాదు. కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల పాలయ్యారు. ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారి కుటుంబాలు ఆగమయ్యాయి. తెలంగాణ వచ్చిన తర్వాతే సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. కరెంటు బాధలు పోయాయి. రాత్రి పొలం కాడికి పోయే బాధ తప్పింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవు. మూడు గంటల కరెంట్‌అని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటు. వాళ్లకు వ్యవసాయరంగం మీద కనీసం అవగాహన లేదు. సీఎం కేసీఆర్ దయతో రైతులందరూ రెండు పంటలు పండించుకుంటున్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ చేస్తున్నారు. ఇంత మంచి సర్కార్‌ను మనమే కాపాడుకోవాలి. సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

*– టంకరి వెంకటయ్య, రైతు, వెంకట్‌రావుపేట, తొగుట మండలం*

## కాంగ్రెస్ వస్తే వ్యవసాయం చేయలేం



హుస్నాబాద్ రూరల్, నవంబర్ 21: కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే రైతులు వ్యవసాయం చేసుడు కష్టమే. ఇప్పుడున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో పంటలు మంచిగ పండుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాత్రి బావుల వద్ద కరెంట్ కోసం ఎదురు చూస్తూ పడుకునే వాళ్లం. ఏ రాత్రి కరెంట్ వస్తదో ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి ఉండేది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని వ్యవసాయం చేయడం తెలంగాణ రైతులకు సాధ్యమయ్యే పనికాదు. రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు తెల్వవు. పొరపాటున కాంగ్రెస్ కనుక అధికారంలోకి వస్తే రైతులు పొలాలు వదులుకొని కూలీ పనికి పోవాల్సిందే.

*– శ్రీను, రైతు, మీర్జాపూర్, హుస్నాబాద్ మండలం*

## మళ్లీ కాంగ్రెస్ వస్తే అరిగోసే



నంగునూరు, నవంబర్ 21: మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అరిగోస తప్పదు. మూడు గంటల విద్యుత్ అంటున్న కాంగ్రెసోళ్ల పొలాలకు మూడుగంటల కరెంట్ ఇస్తే రైతు బాధ తెలుస్తది. కాంగ్రెస్ పదేండ్ల పాలనలో ఇబ్బందులు పడ్డాం. ఏడు గంటల విద్యుత్ అని చెప్పి పగలు మూడు గంటలు రాత్రి మూడు గంటలు వచ్చేది. వచ్చిపోయే విద్యుత్‌తో ఒకమడి పారలేదు. సిగింల్ ఫేస్ విద్యుత్ వల్ల నాలుగు సార్లు మోటర్లు కాలిపోయేవి. మళ్లీ కాంగ్రెస్ పాలన వస్తే కష్టాలు తప్పవు. మునుపటి రోజులే వస్తాయి. నాకు మూడు ఎకరాలు ఉండే అప్పుడు మూడు గుంటలు కూడా పారలేదు.

*–భూక్యామంగ్త నాయక్, జేపీతండా, నంగునూరు*

## మూడు గంటలతో ఎవుసం ఎలా సాధ్యం



నారాయణరావుపేట, నవంబర్ 21: మూడు గంటల విద్యుత్‌తో ఎవుసం చేయడం ఎలా సాధ్యం. కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌పార్మర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. కానీ నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. పంటపొలాలకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నారు.. మంచిగా పంటలు పండించుకుంటున్నాం. కాంగ్రెస్ నేతలు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని అంటుర్రు, ఇది జరగని పని. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే బోరు,బావుల్లో నీళ్లు కూడా ఉండవు.

*–లోకం ప్రభాకర్, గ్రామం, మండలం నారాయణరావుపేట*

## పంటలెట్ల పండుతాయి సారు...

హుస్నాబాద్, నవంబర్ 21: తెలంగాణ రాకముందు ఆరు గంటలు, ఏడు గంటల కరెంట్ ఇస్తే ఎన్ని ఇబ్బందులు పడ్డామో మాకు తెలుసు... చాలీచాలని విద్యుత్‌తో బోరుబావుల వద్ద ఎన్నో తిప్పలు పడ్డాం. కరెంట్ రాత్రిపూట వస్తదో... పగటి పూట వస్తదో తెలియక మస్తు కష్టాలు పడేది. రాత్రంతా బాయిలకాడనే ఉండేది. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు లేవు. 24గంటల కరెంట్ ఇచ్చింర్రు. ఈ మధ్య కొందరు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతదని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరు. ఇదెలా సాధ్యమైతది...? 10హెచ్‌పీ మోటరు పెట్టి మూడు గంటలు నడిపిస్తే బోరు, బావుల్లో నీళ్లుంటయా...? నీళ్లు అడుక్కిపడిపోవా.? రైతులందరూ 10హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు ఉంటయా...? మొత్తం ఎక్కడికక్కడ కాలిపోతాయి. మళ్లీ పాతరోజులు వస్తాయి. రోజూ మెకానిక్‌ల దగ్గరికి మోటరును తీసుకుపోవాల్సిందే. పదేండ్ల నుంచి రందీ లేకుంట ఎవుసం చేసుకుంటున్నాం. మళ్లీ 3గంటల కరెంట్, 10హెచ్‌పీ మోటర్లంటే కష్టం. ఎప్పటిలాగా 24గంటల కరెంట్ ఇస్తేనే మంచిగుంటది లేకుంటే రైతులందరికీ పాతకష్టాలు తప్పవు.

*–కుక్కల ఎల్లయ్య, రైతు, చౌటపల్లి, అక్కన్నపేట మండలం*



## 24 గంటల విద్యుత్ ఉండాల్సిందే



కోహెడ, నవంబర్ 21: రైతులు, పారిశ్రామిక, ఇంటి అవసరాలకు 24 గంటల విద్యుత్ ఉండాల్సిందే. 24 గంటల కరెంట్ ఉంటే అభివృద్ధి జరుగుతుంది. గత ప్రభుత్వాలు విద్యుత్ సక్రమంగా ఇవ్వక చాలా నష్టపోయాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంట్ మంచిగ ఉంటుంది. ఎప్పుడైనా పనులు చేసుకుంటున్నాం. మోటర్లు కాలుడు అనేది సాంకేతిక సమస్య. ఇప్పుడు ప్రభుత్వం ప్రతి మూడు వ్యవసాయ మోటర్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరెంట్ సమస్యలు లేకుండా చేసింది. రైతులకు రాత్రి గోస లేకుండా పోయింది. పారిశ్రామిక రంగానికి 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో ఉత్పత్తి పెరిగింది. అంతకుముందు కరెంట్ ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెలియకపోయేది.

*–గుజ్జుల లింగారెడ్డి, మోటర్ మెకానిక్, కోహెడ*

## 10హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందే..

దుబ్బాకటౌన్, నవంబర్ 21: వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ ఏ మాత్రం ఉపయోగపడదు. భూగర్భజలాలు ఎక్కువ వచ్చే పరిస్థితి లేదు. 5 లేదా 3 హెచ్‌పీ మోటర్లు బిగించుకుంటే సరిపోతుంది. రేవంత్‌రెడ్డి తెల్వక మాట్లాడుతుండో అర్థం కావటం లేదు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు తప్పలేదు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండే. రైతులను ఆగం చేసే పార్టీలు ఉండకూడదు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులు సంబురంగా వ్యవసా యం చేసుకుంటున్నారు. రైతుకు కరెంట్ కష్టాలు ఏమాత్రం లేవు.

*– యాదగిరి, మోటర్ మోకానిక్, దుబ్బాక*



## ఎవుసం మంచిగున్నది

కోహెడ, నవంబర్ 21 : ఇప్పుడు ఎవుసం మంచిగున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ , రైతుకు రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నది. అంతకుముందు కాంగ్రెస్ పాలనలో అరిగోస పడేటోళ్లం. కాంగ్రెసోళ్లు సక్రమంగా కరెంట్ ఇచ్చేటోళ్లు కాదు. త్రీఫేజ్ కరెంట్ రాత్రి ఇచ్చేది. దీంతో బాయికాడికి వెళ్లడానికి ఇబ్బందులు పడేది. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. వరి పంట సాగుచేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. తెలంగాణ వచ్చిన తర్వాత రైతుల బతుకులు బాగుపడ్డాయి.

*– నిమ్మనగొట్టు రాజయ్య, రైతు కోహెడ*





## 'ధరణి'ని తీసేస్తే పాత రోజులే

హుస్నాబాద్, నవంబర్ 21: తెలంగాణ సర్కారు తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను తీసేస్తే మళ్లీ పాత రోజులు తప్పవు... భూముల రిజిస్ట్రేషన్, ఇతర మార్పులకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తది. ధరణి రాకముందు పహణీలో దాదాపు 20 నుంచి 30కాలమ్స్ పెట్టి అమ్మినోళ్లు, కొన్నోళ్లు, పట్టాదారు, అనుభవదారు అంటూ అందరినీ అందులోనే రాసేటోళ్లు. దీంతో వీళ్లందరి మధ్య పంచాయతీ మొదలయ్యేది. మార్పులు చేయాలంటే పట్టాదారు పాసుపుస్తకం కావాలంటారు. వీఆర్‌వో, ఆర్‌ఐ, ఇతర అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వచ్చేది. అది కూడా నెలల తరబడి తిరిగితేనే పనయ్యేది. పైసలిస్తే ఒకరి భూమిని ఇంకొకరి పేరు మీద రాసేటోళ్లు. దీని వల్ల గ్రామాల్లో రైతుల మధ్య పంచాయితీలు, కొట్లాటలు బాగా ఉండేవి. ఇవన్నీ పోవాలనే సర్కారోళ్లు ధరణి పోర్టల్‌ను తెచ్చింర్రు. స్లాట్ బుక్ చేసుకొని నేరుగా తహసీల్ కార్యాలయానికి వెళ్తే అరగంట లోపే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి పట్టాదారు పాసుపుస్తకం కూడా చేతికొచ్చే విధానం వచ్చింది. దీని వల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే రోజులు పోయాయి. రైతు వెలిముద్ర, సంతకం చేస్తేనే ఇంకొకరి పేరుమీదికి భూమి మారే అవకాశం మాత్రమే ఉంది. ఇది రైతులకు మంచిదేకదా. ధరణి పోర్టల్‌లో ఉన్న చిన్నపాటి లోపాలను సరిచేసినట్లయితే దీనికంటే మంచిది ఇంకొకటి ఉండదు. ఏమైనా చిన్న లోపాలుంటే సరిచేయాలి తప్పామొత్తానికి ధరణిని తీసేయడం కరెక్టు కాదు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలోళ్లు, సర్కారోళ్లు ఆలోచన చేయాలె. రైతులకు మేలు చేస్తున్న ధరణిని తీసేయరాదు. ధరణిని తీసేస్తే పాతరోజులు ముందుకొచ్చి రైతులకు లేని కష్టాలు వస్తాయి. రైతులను ఇబ్బందులకు గురిచేసేటోళ్లకు పుట్టగతులుండవు.

*– కిషన్‌రావు, రైతు, చౌటపల్లి, అక్కన్నపేట మండలం*



## దళారుల రాజ్యమే



హుస్నాబాద్ టౌన్, నవంబర్ 21: ధరణి తీసేస్తే మళ్లీ దళారులదే రాజ్యం అవుతుంది.. ఏలు పెడితే ఎవరి భూములు వాళ్లకు అయితున్నయి. భూమి రిజిస్ట్రేషన్ చేసి పాసుబుక్కులు ఇత్తంర్రు. ఇప్పుడు రైతులకు పెద్దగా ఇబ్బంది ఏమీలేదు. ధరణితీసేసి పట్వారీ వ్యవస్థ తీసుకువస్తే దళారులు, దొంగలకు రాజ్యం అప్పగించినట్లే. ధరణి తీసివేస్తే పెద్దోళ్లకు లాభం ఉంటుందనే కాంగ్రెసోళ్లు ఈ మాటలు చెబుతుంర్రు. మళ్లీ భూమిపట్టాకోసం వీఆర్‌వో, ఆర్‌ఐ, తహసీల్దార్ చుట్టూ తిరగాల్సిందే. ధరణిని మార్చుతమని అంటే కాంగ్రెసోళ్లు దొంగలచేతికి రాజ్యం ఇచ్చినట్లే. కాంగ్రెస్ పనికిరాని వాగ్దానాలు చేసి రైతులను ఆగం చేసుడు తప్ప రైతులకు లాభం చేసే ముచ్చట లేదు.

*– ఆలేటి మాధవరెడ్డి, రైతుసంఘం నాయకుడు, హుస్నాబాద్*

## బ్రోకర్ల రాజ్యం వస్తది



నంగునూరు, నవంబర్ 21:ధరణి తీసేస్తే మళ్లీ దళారుల దందా షురూ తప్పదు. మళ్లీ భూ రికార్డుల కోసం వీఆర్‌ఎలు, వీఆర్వోలు, ఆర్‌ఐ. తహసీల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. పనులు కావు. బ్రోకర్ల రాజ్యం వస్తది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భూ రికార్డుల కోసం ఆధికారుల చుట్టూ తిరిగిన రోజులు మర్చిపోలేదు. ధరణిని తీసేస్తే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు. ఇప్పుడు ఒకరోజుల్లోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయితుంది. ధరణి తీసేసి మళ్లీ 36 కాలమ్స్ పెడితే భూ రికార్డులు గందరగోళమవుతాయి. పండిన పంట అమ్ముకోవాలంటే, బ్యాంక్ లోన్ కోసం పట్టాదారు పాస్‌బుక్ కావాలంటే వీఆర్వో దగ్గరికి వెళ్లాలి.

*–కరుణకర్‌రెడ్డి, ముంద్రాయి, నంగునూరు మండలం*

## ధరణితోనే దళారులకు చెక్



మర్కూక్, నవంబర్21: ధరణితో దళారులకు చెక్ పడింది. మేము రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములకు ఎలాంటి పైరవీలు లేకుండా పాసు పుస్తకాలు వచ్చాయి.గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉండేది కానీ.. నేడు అలాంటిది ఏమీ లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు పాసుపుస్తకాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. పేద రైతులకు లాభం జరిగింది. పేదల భూముల కష్టాలు తీరాయి. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తాం అంటుంది.ఇది వరకు రిజిస్ట్రేషన్ అయినంక మ్యుటేషన్ తర్వాత అయితుండే. ఒక్కొక్కసారి అమ్మిన వ్యక్తి వీఆర్‌వోతో కుమ్మక్కై తన పేరు మీద మళ్లీ భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న సందర్భాలు చూశాం. కానీ నేడు ఆపరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

*–రాజిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, నర్సన్నపేట మర్కూక్ మండలం*